క్లుప్తంగా

27న ఆలయ భూమికి బహిరంగ వేలం

రామవరప్పాడు: ఎనికేపాడులోని శ్రీ సీతారామస్వామి ఆలయానికి చెందిన 2.30 సెంట్ల భూమికి ఈ నెల 27న సీల్డ్ టెండర్ – బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ఎస్ నెంబరు 186లో దక్షిణం వైపు న్యూ ఆటోనగర్ రోడ్డును ఆనుకొని ఉన్న సుమారు 1,936 చదరపు గజాల్లో 5 బిట్ల స్థలానికి వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం దేవదాయశాఖ ఉన్నతాధికారుల సమక్షంలో 11 ఏళ్ల కాలపరిమితికి సీల్డ్ టెండర్-బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని ఆసక్తి ఉన్నవారు పాల్గొనాలని కోరారు.

రామలింగేశ్వరుడి సన్నిధిలో ఎమ్మెల్యే సారథి



పెనమలూరు: యనమలకుదురులోని శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామిని సోమవారం ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి దర్శించుకున్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఎమ్మెల్యే సారథి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఏపీ ధార్మిక పరిషత్ చైర్మన్ సంగా నరసింహారావు శేషవస్త్రాలు కప్పి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం అన్నసమారాధనలో పాల్గొన్నారు. ఆలయ అర్చకుడు సాగన్, ఈఓ ఎం.గంగాధరరావు పాల్గొన్నారు.

కౌలు రైతు సంఘం నేతల ధర్నా

పెనమలూరు: ఖరీఫ్ సొమ్ము బకాయి రైతులకు చెల్లించాలని కోరుతూ ఏపీ కౌలు రైతు సంఘం నేతలు సోమవారం కానూరులో పౌరసరఫరాల సంస్థ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం ఆ శాఖ జీఎం శిరీషకు వినతిపత్రం అందజేశారు. కౌలు రైతు సంఘ రాష్ట్ర కార్యదర్శి మాగంటి హరిబాబు, సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయప్రసాద్, గౌరిశెట్టి నాగేశ్వరరావు, కౌలు రైతు సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కోసూరి శివనాగేంద్ర, పంచకర్ల రంగారావు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ సమన్యాయమే లక్ష్యం



గన్నవరం: అందరికీ సమన్యాయం అందించడమే లక్ష్యమని అదనపు జూనియర్ సివిల్ జడ్జి శిరీష తెలిపారు. రాయ్‌నగర్‌లోని బాలుర వసతి గృహంలో సోమవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన అంతర్జాతీయ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి శిరీష మాట్లాడుతూ సమన్యాయం కోసం కోర్టుల ద్వారా పేద వర్గాలకు ఉచిత న్యాయ సేవలందిస్తున్నట్లు చెప్పారు. సంఘ అధ్యక్షులు అమర్తల సోమేశ్వరరావు, ఉపాధ్యక్షురాలు వైఆర్ శారద, కార్యదర్శి రామకూరి ప్రకాశరావు, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యులు దాసరి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు డీఆర్వో అభినందన

చిలకలపూడి(మచిలీపట్నం): జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న జిల్లాకు చెందిన క్రీడాకారులను సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు అభినందించారు. మధ్యప్రదేశ్‌లోని మహేశ్వరంలో జనవరి 30 నుంచి ఫిబ్రవరి 11వ తేదీ వరకు జరిగిన ఐదో జాతీయ స్థాయి ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఐదుగురు క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో నాగిడి గాయత్రి (సిల్వర్ మెడల్), నాగిడి భార్గవి (నాలుగో స్థానం) స్లాలమ్ డిస్ప్లేలో మెడల్స్ సాధించారు. మెడల్స్ సాధించిన క్రీడాకారులను డీఆర్వో వెంకటేశ్వర్లు శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి యు. శ్రీనివాసరావు, చీఫ్ కోచ్ కె. ఝాన్సీలక్ష్మి, వాటర్ స్పోర్ట్స్ కోచ్ ఎం. శ్రీనివాస్, టి. నాగబాబు పాల్గొన్నారు.

ఆలోచన.. అద్భుత ఆవిష్కరణ

- భళా.. విద్యార్థుల మేధ
- తక్కువ ఖర్చుతో చేతి పరిశుభ్రత వ్యవస్థ రూపకల్పన
- వ్యాధుల నుంచి రక్షణ
- సామాన్యులకు సైతం అందుబాటులోకి తేవడమే లక్ష్యం



హ్యాండ్ హైజిన్ సిస్టమ్ రూపకల్పనలో విద్యార్థులు



సిస్టమ్‌లో అమర్చిన పరికరాలు

కంకిపాడు: మదిలో మెదిలిన వినూత్న ఆలోచనలకు రూపమిస్తూ అద్భుత ఆవిష్కరణ చేసి తమదైన శైలిలో ముందుకెళ్తున్నారు ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు. తక్కువ ఖర్చుతో చేతి పరిశుభ్రత వ్యవస్థకు రూపకల్పన చేశారు కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం సీఎస్ఈ విద్యార్థులు. కళాశాల విద్యార్థులు ఎం.జస్వంత్, కేపీ మణికంఠ, ఎస్.అక్షయ, కె.జాహ్నవి హ్యాండ్ హైజిన్ సిస్టమ్ తయారుచేశారు. అవసరమైన మార్పులు చేసి సరికొత్తగా ఈ వ్యవస్థను సామాన్యులకు కూడా చేరువ చేయడమే తమ లక్ష్యమని వారు చెబుతున్నారు. కంకిపాడు తహసీల్దార్ కార్యాలయంలో ఇటీవల సిస్టమ్ పనితీరుపై డెమో ఇచ్చి ఔరా అనిపించుకున్నారు. సిస్టమ్ తయారీ, పనితీరు వారి మాటల్లోనే...

వ్యాధులతో సతమతం

'చిన్నపాటి నిర్లక్ష్యం.. కోవిడ్ ప్రపంచాన్ని గడగడలాడించింది. ఎన్నో వ్యాధులకు మూలం పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యంగా ఉండటమే. దీన్ని గుర్తించి ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంచడానికి కృషి చేయాలని నిర్ణయించుకున్నాం. బయటి మార్కెట్‌లో చేతులను శుభ్రం చేసుకునే హ్యాండ్స్ హైజిన్ సిస్టమ్స్ రూ 4 వేల నుంచి రూ 50 వేలు వరకూ ధర పలుకుతున్నాయి. సామాన్య ప్రజలకు అందుబాటులో లేవు. అందుకే తక్కువ ఖర్చుతో హ్యాండ్ హైజిన్ సిస్టమ్‌ను రూపొందించడానికి పూనుకున్నాం.



కంకిపాడు తహసీల్దార్ కార్యాలయంలో ఇటీవల డెమో ఇచ్చిన విద్యార్థులు

కేవలం వెయ్యి రూపాయిలతో హ్యాండ్ హైజిన్

కళాశాల ప్రిన్సిపాల్ శివాజీబాబు, హెచ్‌ఓడీ జయలక్ష్మి ప్రోత్సాహంతో అసిస్టెంట్ ప్రొఫెసర్ డానియేల్ సహకారం, సూచనలు తీసుకున్నాం. చిన్నపాటి చెక్క పెట్టె తయారీకి రూ.500 వెచ్చించాం. అందులో అమర్చడానికి డీసీ మోడల్ 5 ఓల్ట్స్ మోటార్, రిలే మాడ్యుయల్, ఐఆర్ సెన్సర్, శానిటైజర్, సిలైన్ పైపు, 3.7 ఓల్ట్స్ బ్యాటరీ ఆన్‌లైన్‌లో రూ 450కి కొనుగోలు చేశాం. అవసరమైన వైర్లుతో కలిపి వెయ్యి రూపాయలు అయ్యింది. మోటారు పని చేయడానికి కేవలం సెల్‌ఫోన్‌కి వినియోగించే చార్జర్ ద్వారా కరెంటు సరఫరా వ్యవస్థను ఏర్పాటుచేశాం. హైజిన్ సిస్టమ్‌లో బయటకు పంపిన సిలైన్ పైపు వద్ద ఉంచగానే ఇందులో ఉంచి సెన్సర్ పనిచేసి శానిటైజర్ పైపు ద్వారా చేతిలోకి వచ్చి పడుతుంది. సెన్సర్ పని చేసినప్పుడు మాత్రమే విద్యుత్ వినియోగం జరుగుతుంది. షార్టు సర్క్యూట్ కాకుండా ఉండటానికి రిలే మాడ్యుయల్స్ అమర్చాం. దీంతో సిస్టమ్‌కు ప్రమాదం ఉండదు. ప్రస్తుతం ఆర్నెల్ల గ్యారెంటీతో సిస్టమ్‌ను తయారుచేసి ఇటీవల కళాశాలలో నిర్వహించిన ఎక్స్‌పోలో ప్రదర్శించాం. మా ప్రాజెక్టుకు ఏ గ్రేడ్ లభించింది. ఎక్స్‌పో ప్రదర్శనలో 8 గంటల పాటు వినియోగిస్తే విద్యుత్ రూ.14 ఖర్చు అయ్యిందని అంచనా. దీంతో ఖర్చు ఆదా, వ్యాధులు నుంచి కుటుంబానికి రక్షణ పొందుతారు అని నమ్ముతున్నాం.' అని వివరించారు.

మరింత సూక్ష్మం చేయాలి



ప్రస్తుతం చిన్న పాటి చెక్కపెట్టెలో అమరేలా సిస్టమ్ రూపొందించాం. దీన్ని మరింత సూక్ష్మంగా తయారు చేయాలని ఉంది. కనీసం ఏడాది గ్యారెంటీ ఉండేలా చేయాలని ఆలోచన.

– ఎం.జస్వంత్, కేపీ మణికంఠ

పేదలకు అందుబాటులోకి రావాలి



బయట దొరికే హైజిన్ సిస్టమ్‌లు పేద, మధ్యతరగతికి అందుబాటులో లేవు. ఉన్నత వర్గాలు, కార్యాలయాల్లో ఏర్పాటుకే పరిమితం. పేదలకు సైతం అందుబాటులో ఉండేలా చిన్న పాటి చేతి పరిశుభ్రత వ్యవస్థ తీసుకురావాలి. ఆరోగ్యంపై అవగాహన పెరిగి వీటిని వినియోగిస్తే ప్రజారోగ్యం మెరుగు పడుతుంది.

– ఎస్.అక్షయ, కె.జాహ్నవి

నేడు కేడీసీసీబీ నూతన భవనానికి శంకుస్థాపన

హనుమాన్‌జంక్షన్ రూరల్/ఉంగుటూరు: కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ హనుమాన్‌జంక్షన్ శాఖ నూతన భవన నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేయనున్నట్లు బ్యాంక్ చీఫ్ మేనేజర్ మల్లి సాహితి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ రోడ్డులో కేడీసీసీబీ ఇటీవల కొనుగోలు చేసిన 17.5 సెంట్ల స్థలంలో నూతన భవనాన్ని రూ.1.27 కోట్ల వ్యయం అంచనాతో నిర్మించనున్నట్లు ఆమె వివరించారు.

ఎమర్జింగ్ ట్రెండ్స్‌పై అంతర్జాతీయ సదస్సు

గుణదల(విజయవాడ తూర్పు): ఎలక్ట్రానిక్స్ రంగం నానాటికీ అభివృద్ధి సాధిస్తోందని, విద్యార్థులు ఎలక్ట్రానిక్స్‌లో అవగాహన పెంపొందించుకోవాలని ఫోపుల్ టెక్నాజిస్ సీఈఓ గోపి రాజా అన్నారు. ఆంధ్ర లయోల కళాశాల ఆవరణలో ఎమర్జింగ్ ట్రెండ్స్ అనే అంశం పై అంతర్జాతీయ సదస్సు సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గోపీ రాజా మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక విధానంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. నానాటికి సరికొత్త టెక్నాలజీ ఆవిష్కృతమవుతోందని పేర్కొన్నారు. మానవ జీవితాన్ని నూతన టెక్నాలజీలు ప్రభావితం చేస్తున్నాయని వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ ఫాదర్ జీఏపీ కిశోర్ మాట్లాడుతూ, విద్యార్థులకు సాంకేతికతపై అవగాహన కల్పించేందుకు ఇటువంటి అవగాహన సదస్సులు ఎంతగానో దోహద పడతాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ ఫాదర్ సహాయరాజ్, వైస్ ప్రిన్సిపల్ టి. ప్రభు, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి బి. బాలాజి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యతే అసమానతలకు కారణం

పటమట(విజయవాడతూర్పు): దేశంలో నిరక్షరాస్యతే అసమానతలకు ప్రధాన కారణాలని ప్రముఖ సామాజిక కార్యకర్త డాక్టర్ పద్మావతి అన్నారు. సోమవారం స్టెల్లా కళాశాలలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ క్లబ్, సోషల్ వర్క్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు హాజరైన ఆమె మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా అసమానతలు రూపుమాపడం కోసం విద్యార్థులు సామాజిక అంశాలపై అధ్యయనం చేయాలని, ప్రతి అంశాన్ని సునిశితంగా పరిశీలించాలన్నారు. హేతుబద్ధమైన ఆలోచనలతో విద్యార్థుల మేదస్సు మరింత మెరుగవుతుందని చెప్పారు. సమావేశంలో కళాశాల డిగ్రీ వైస్‌ప్రిన్సిపాల్ అనూహ్య, సహాయమేరి, డిగ్రీ విద్యార్థులు పాల్గొన్నారు.

స్పందనలో 94 అర్జీలు స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో వెంకటేశ్వర్లు, డీఆర్డీఏ పీడీ ప్రసాద్

చిలకలపూడి(మచిలీపట్నం): స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం జరిగింది. డీఆర్వోతో పాటు డీఆర్డీఏ పీడీ పి.ఎస్.ఆర్.ప్రసాద్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం డీఆర్వో మాట్లాడుతూ.. అర్జీదారులు విన్నవించుకున్న సమస్యలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి వారికి సంతృప్తికరమైన పరిష్కారాన్ని చూపాలన్నారు. నిర్దేశించిన గడువులోగా సమస్యలను కచ్చితంగా పరిష్కరించాలన్నారు. స్పందనలో 94 అర్జీలను అధికారులు స్వీకరించారు.

ముఖ్యమైన అర్జీలు ఇవీ...

- వృద్ధులమైన తాము జీవనం సాగించడం కష్టంగా ఉందని, కుమారులు పట్టించుకోవడం లేదని, వైద్య ఖర్చుల నిమిత్తం ఉన్న కొద్దిపాటి భూమిని విక్రయిద్దామంటే వారు బెదిరింపులకు గురిచేస్తున్నారని నాగాయలంక మండలం బర్రంకుల గ్రామానికి చెందిన పిరాటి వెంకయ్య దంపతులు అర్జీ ఇచ్చారు. కుమారుల నుంచి రక్షణ కల్పించి తగిన న్యాయం చేయాలని కోరారు.
- 'జిల్లాలో నీటితీరువా పన్నులను సచివాలయాల్లో చెల్లించే సదుపాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. ఆయకట్టు రైతుల వివరాలను ఏపీ పోర్టల్‌లో నమోదుచేశారు. ఈ సంవత్సరానికి సంబంధించి నీటితీరువా వసూళ్లను ఇంకా ప్రారంభించలేదు. నీటి తీరువా బకాయిల వసూళ్లపై తగిన చర్యలు తీసుకోవాలి' అని సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ అర్జీ ఇచ్చారు.

క్రమశిక్షణతో ఉన్నత స్థానాలు



విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ఉంగుటూరు: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు ఆకాంక్షించారు. తేలప్రోలులో భీమవరపు కృష్ణమోహన్‌రెడ్డి జెడ్పీ హైస్కూల్‌లో స్వర్ణశిల్పి పెట్ల సత్యనారాయణ మూర్తి, లక్ష్మీనరసమ్మ 16వ వర్ధంతి పురస్కరించుకుని విద్యలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను సోమవారం పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో విద్యనభ్యసించాలన్నారు. ట్రస్ట్ నిర్వాహకులు పెట్ల కామేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ లాం దిబోర, ఎంపీడీఓ శేషగిరిరావు, ఉషారామ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ కె.రాజశేఖర్, జాకీర్ హుస్సేన్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ మహా బాషా, హెచ్ఎం సరోజిని, పూర్వ విద్యార్థులు ముత్తారెడ్డి, మోదుగు భానుప్రకాష్ పాల్గొన్నారు.

యనమలకుదురులో ఘనంగా వసంతోత్సవం

కృష్ణానదిలో త్రిశూల స్నానం



యనమలకుదురులో స్వామివారి వసంతోత్సవంలో పాల్గొన్న భక్తులు

పెనమలూరు: యనమలకుదురులోని శ్రీ పార్వతి సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వసంతోత్సవం ఘనంగా చేశారు. స్వామివారి కల్యాణం చేసిన మావులూరి రాజశేఖర్ దంపతులు, భక్తులు స్వామివారిని వీధుల్లో ఊరేగించారు. మహిళలు రంగులు జల్లుకుంటూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వసంతోత్సవం చేశారు. అనంతరం స్వామివారిని శివలింగాల ఘాట్ వద్ద పవిత్ర కృష్ణానదిలో త్రిశూలస్నానం చేయించారు. భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిగింది. రాత్రి 7 గంటలకు ధ్వజ అవరోహణ, మూగబలి, ద్వాదశ ప్రదక్షిణలు చేశారు. స్వామివారికి పవళింపు సేవ, సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. స్వామివారికి నివేదన చేసిన నందిముద్దలను సంతానం కోసం భక్తులు అందచేశారు. నాలుగు రోజులుగా జరుగుతున్న బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

అధునాతన దంత వైద్య చికిత్సలతో మేలు

ప్రొఫెసర్ డాక్టర్ సతీష్ ఆలపాటి



డాక్టర్ సతీష్‌ను సత్కరిస్తున్న డాక్టర్ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ రామోజీరావు, రవిచంద్రశేఖర్

గన్నవరం రూరల్: అధునాతన వైద్య చికిత్సలతో దంత వైద్య విద్యార్థులు సమాజానికి సేవలందించాలని చికాగో ఇల్లినోయిస్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ సతీష్ ఆలపాటి పేర్కొన్నారు. సోమవారం గన్నవరం మండలం చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాలలో పీడియాట్రిక్ డెంటిస్ట్రీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ జరిగింది. రీజనరేటివ్ ఎండోడాంటిక్స్ పద్ధతిలో అధునాతన దంతవైద్య సేవలు అందించడంపై 400మంది దంత వైద్య విద్యార్థులు పాల్గొన్న సదస్సులో ఉపన్యసించారు. అనంతరం విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వివరించారు. సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు, డాక్టర్ పిసిమ్స్ డైరెక్టర్ జనరల్ డాక్టర్స్ చదలవాడ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల్లో దంత సంరక్షణపై అవగాహన పెరిగిందన్నారు. పీడియాట్రిక్ డెంటిస్ట్రీ హెచ్‌ఓడీ డాక్టర్ కె.రవిచంద్ర శేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు, ఏవో వై.మధుసూదనరావు, వైద్యులు కె.శ్రీకాంత్, కె.మృదుల, అధ్యాపకులు పాల్గొన్నారు.

అమ్మభాషలో కమ్మదనం ఆస్వాదించాలి

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సంస్కృతి, సంప్రదాయాలు మాతృభాషతోనే ముడిపడి ఉంటాయని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి.మురళీకృష్ణ చెప్పారు. స్థానిక రావిచెట్టు సెంటర్‌లోని జనశిక్షణ సంస్థాన్ ఆవరణలో మాతృభాషా దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. మురళీకృష్ణ అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో నివసిస్తున్న తెలుగు వారు వారి మాతృభాష అయిన తెలుగును అభ్యసించకపోవడం దురదృష్టకరమన్నారు. మరో అతిథిగా హాజరైన బాలోత్సవ్ కమిటీ అధ్యక్షుడు ఎస్‌పీ రామరాజు మాట్లాడుతూ తెలుగు భాషను అభ్యసించే వారి సంఖ్య క్రమంగా తగ్గిపోతుందన్నారు. తెలుగు భాషాభివృద్ధికి అందరూ కృషి చేయాలని కోరారు. జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ విద్యాకన్న మాట్లాడుతూ తెలుగు భాషలో తియ్యదనం ఉంటుందని, విదేశాల్లో స్థిరపడిన తెలుగు కుటుంబాలకు చెందిన వారు తెలుగు భాషను నేర్చుకోవాలన్నారు. సభ అనంతరం కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వెన్నా వల్లభరావు, ప్రపంచ తెలుగు రచయితల సంఘం ఉపాధ్యక్షుడు గుమ్మా సాంబశివరావును సత్కరించారు. ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు, రచయిత నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

కంకిపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బాలుడు చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందిన ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నెప్పల్లి గ్రామానికి చెందిన పాలపర్తి అనూష తన చిన్న కుమారుడు అభినవ్ (6)తో కలిసి ఈ నెల 16న నెప్పల్లి సెంటరులో రోడ్డు దాటుతున్నారు. ఆ సమయంలో ఉయ్యూరు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న వ్యాన్ ఆ బాలుడిని ఢీకొంది. ఘటనలో అభినవ్ ముఖానికి, తలకు బలమైన గాయాలయ్యాయి. బాధితుడిని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం అభినవ్ మృతి చెందాడు. ఆస్పత్రి వర్గాల సమాచారంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం పెరికీడు వద్ద 16వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఏలూరు జిల్లా పెదపాడు మండలం తాళ్లమూడికి చెందిన కోటా మధు (29) బుల్లెట్‌పై గుడివాడ వెళ్తున్నాడు. పెరికీడు ఫ్లై ఓవర్ వద్ద సర్వీసు రోడ్డులోకి వెళ్లుతున్న కారు అతని ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఘటనలో బుల్లెట్ నడుపుతున్న మధుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రుడిని ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న హనుమాన్‌జంక్షన్ పోలీసులు ఘటనపై కేసు నమోదు చేశారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



పామర్రు: రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో తమ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారని ఏఎన్ఎం ప్రిన్సిపాల్ ఏ పూర్ణచంద్రారెడ్డి అన్నారు. స్థానిక యలమర్రు రోడ్డులోని ఏఎన్ఎం హైస్కూల్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 19న వేమవరం కొండలమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు బహుమతులు, ప్రశంసాపత్రాలను సాధించారన్నారు. అండర్-14 కటా విభాగంలో జశ్వంత్ సాయినాథ్, దుండి ప్రతాప్, అభిషేక్ కుమార్, ధాత్రి చరణ్య, మమతాశ్రీ, హర్షిత‌లు ప్రథమ స్థానం సాధించి బంగారు పతకాన్ని పొందారన్నారు. వర్ణికారెడ్డి, మణికంఠ, రాకేష్ పి.మణికంఠ ద్వితీయ స్థానంలో రజిత పతకాలను సాధించారన్నారు. పవన్‌కుమార్, మౌనిక, నిశాంత్, సుప్రియ దీక్షిత, శ్రావ్యలు తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకాలను పొందారు. వీరికి శిక్షణ ఇచ్చిన కోచ్ వీవీఎస్ రామకృష్ణలను ప్రిన్సిపాల్, హెచ్ఎం శర్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

లబ్ధిదారులకు అవగాహన

పాములపాడు(పెదపారుపూడి): పాములపాడు సచివాలయం వద్ద ఈవోపీఆర్డీ, గ్రామ ప్రత్యేకాధికారి ఎం.నాగిరెడ్డి ఇళ్ల నిర్మాణ పనుల వేగవంతంపై లబ్ధిదారులకు సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు. నాగిరెడ్డి మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేసి బేస్మెంట్ పనులు ప్రారంభిస్తే వెంటనే బిల్లులు వచ్చేలా కృషి చేస్తామన్నారు. ఇప్పటికే తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలను కల్పించామన్నారు. పంచాయతీ కార్యదర్శి సాగరరాణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పూర్ణాహుతి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని పురాతన ఆలయమైన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో జరుగుతున్న మహాశివరాత్రి మహోత్సవాల్లో భాగంగా సోమవారం పూర్ణాహుతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి హేమలతాదేవి పర్యవేక్షించారు.